


## పాలీఇథలీన్ పరిశ్రమకు ప్రతిపాదన

● పోర్టు పరిధిలో 'ఎగ్లాంబిల్' ప్రతినిధుల స్థల పరిశీలన

టెక్కలి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మూలపేట పోర్టు పరిధిలో అమెరికాకు చెందిన ఎగ్లాంబిల్ కంపెనీ 1,250 ఎకరాల్లో రూ.83,500కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టు పాలీఇథలీన్ పరిశ్రమ ఏర్పాటు చేయాలని భావిస్తోంది. శుక్రవారం ఆ సంస్థ మేనేజర్లు, ఇంజనీర్లు, ప్రతినిధులు జెవెస్టకాట్, సేలింలో, డీపీ ప్రసన్న, శ్రీసీజ్ రామచంద్రన్, రంజిత్ కుమార్ ఈ ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. పరిశ్రమ నెలకొల్పితే తాము సమకూర్చే వనరులపై ఆర్డీవో కృష్ణమూర్తి వారికి అవగాహన కల్పించారు. రైల్ రోడ్డు అనుసంధానం, టెక్కలిలో 220 కేవీ సబ్‌స్టేషన్ నుంచి అవసరమైన విద్యుత్, 50కిలోమీటర్ల దూరంలోని గొట్టాబ్యారేజ్ నుంచి నీరు (మిగతా 6వ పేజీలో..)

# పరిశ్రమలకు సపోర్టు



మూలపేట పోర్టు తీరప్రాంతం

● అందరి చూపు.. 'సంతబొమ్మాళి' వైపు
● మూలపేట చుట్టూ పారిశ్రామికాభివృద్ధికి కృషి
● హల్దియా పెట్రో కెమికల్స్, కళ్యాణి స్టీల్స్, యామ్నా సంస్థల స్థల పరిశీలన
● వనరులు కల్పించేలా అధికారుల చర్యలు

టెక్కలి, జూన్ 27(ఆంధ్రజ్యోతి):

రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో.. అందరి చూపు జిల్లాలోని సంతబొమ్మాళి మండలంపైనే పడింది. ఈ మండలంలోని మూలపేటలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టు ఏర్పాటు కావడమే ఇందుకు ప్రధాన కారణం. పోర్టు చుట్టూ పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహికులు ఆసక్తి చూపుతున్నారు.



పోర్టు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అమెరికన్ బృందం సభ్యులు, అధికారులు

అటు ఒడిశాలోని పారాదీప్, ఇటు విశాఖ పోర్టు మధ్యలో మూలపేట పోర్టు తయారవుతోంది. రూ.4,361.91కోట్లతో నిర్మిస్తున్న పోర్టు పనులు 50 శాతం ఇప్పటికే పూర్తయ్యాయి. ఈ ఏడాది అక్టోబరు, డిసెంబరు మధ్య కాలంలో రవాణా నౌకల రాకపోకల ట్రైల్‌రన్ నిర్వహించాలని పోర్టు యంత్రాంగం భావిస్తోంది. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి పూర్తిస్థాయిలో రవాణా నౌకలు నడిపించే దిశగా పోర్టు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

పోర్టుకు అనుసంధానంగా నౌకాయానం ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వ్యాపారాభివృద్ధికిగాను పలు సంస్థలు ఈ ప్రాంతంపై దృష్టి సారించాయి. పోర్టుకు దగ్గరగా ఏపీఐఐసీకి చెందిన రెండువేల ఎకరాల భూముల, ఐదు వేల ఎకరాల సాల్ట్ భూములు, 1,800 ఎకరాలు సమీర్‌పేట లాజిస్టిక్ భూములు, ఏడువేల ఎకరాలకుపైగా జిరాయితీ భూములు ఉన్నాయి. మరోవైపు సముద్రతీర ప్రాంతం కావడంతో ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు అనుకూల వాతావరణం లభించనుంది. పోర్టుకు దగ్గరగా 3వేల ఎకరాల్లో రూ.90వేల కోట్లతో పశ్చిమబెంగాళ్‌కు చెందినహల్దియా పెట్రో కెమికల్స్ సంస్థ, అలాగే వెయ్యి ఎకరాల్లో రూ.20వేల కోట్లతో పూణేకు చెందిన కళ్యాణి స్టీల్స్ 300 ఎకరాల్లో రూ.20వేల కోట్లతో యూకేకు చెందిన యామ్నా సంస్థల ప్రతినిధులు గ్రీన్ అమ్మోనియా తయారీ పరిశ్రమలకు అవసరమైన భూసేకరణకు ఈ ప్రాంతాలను అన్వేషించారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన వనరులు, సాధ్యాసాధ్యాలను గుర్తించారు. అలాగే భావనపాడు ప్రాంతంలో పది ఎకరాల్లో రిసార్ట్స్ నిర్మాణం, పర్యాటకం అభివృద్ధికి, మరిన్ని చిన్నచిన్న పరిశ్రమలకు స్థల పరిశీలన చేశారు. కాగా, పోర్టు మూలంగా పలు అనుబంధ పరిశ్రమలు ఏర్పడి స్థానికులకు, నిర్వాసితులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు భావిస్తున్నారు.

### అనువైన వనరులు..

జాతీయ రహదారికి దగ్గరగా ఉండడం, విమానాశ్రయం, రైలు సౌకర్యాలు కలిగి ఉండడం ఆయా సంస్థలు మూలపేట పోర్టు పరిసర ప్రాంతాలను ఎంచుకున్నాయి. ఈ ప్రాంతాన్ని లాజిస్టిక్ పార్క్‌గా తయారీకి ద్వారాలు తెరుచుకున్నాయి. గత ఏడాది నవంబరులో బెంగాళ్ నుంచి హల్దియా పెట్రో కెమికల్స్ బృందం, ఏప్రిల్‌లో పూణేకు చెందిన కళ్యాణి స్టీల్స్, మే నెలలో యూకేకు చెందిన యామ్నా ప్రతినిధులు స్థానిక ఆర్డీవో, ఏపీ (మిగతా 6వ పేజీలో..)



దివ్యాంగురాలికి బ్యాటరీ ట్రై సైకిల్, హెల్మెట్‌ను అందజేస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు. చిత్రంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, గొండు శంకర్

## దివ్యాంగులకు అండగా ఉంటాం

● కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు
● 803 మందికి 1,238 పరికరాల పంపిణీ

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను అన్ని విధాలా ఆదుకుంటామని, ఎల్లప్పుడూ అండగా ఉంటామని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో దివ్యాంగులకు పరికరాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 'ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) ఆధ్వర్యంలో ఆలింకో సంస్థ సహకారంతో జిల్లాలో 803 మంది దివ్యాంగులకు రూ.3.20కోట్ల విలువైన 1,238 పరికరాలను (మిగతా 6వ పేజీలో..)



బ్యాటరీ ట్రై సైకిళ్లు, పరికరాలతో దివ్యాంగులు




# సమస్యలు పరిష్కరించరూ!

● ఎప్పుడూ కొన్ని శాఖలకే పరిమితం.. ● ప్రజల ఇబ్బందులనూ గమనించాలంటూ విన్నపాలు
● గాడి తప్పుతున్న కొందరు అధికారుల తీరు ● నేడు జడ్పీ సర్వ సభ్య సమావేశం

శ్రీకాకుళం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నా.. పాత సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలన్నా ప్రజాప్రతినిధులు.. అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిందే. శ్రీకాకుళం జడ్పీ సమావేశ మందిరంలో శనివారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరగనుంది. ఉమ్మడి జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలు, మండల పరిషత్ అధ్యక్షులు హాజరుకానున్నారు. ప్రతీసారి కొన్ని ప్రభుత్వ శాఖలకే పరిమితమైపోతున్న సర్వసభ్య సమావేశం.. ఈసారైనా ప్రజాసమస్యలకు ప్రాధాన్యమివ్వాలని జిల్లావాసులు కోరుతున్నారు. అన్ని కీలక ప్రభుత్వ శాఖలపై చర్చ జరగాలని విజ్ఞప్తి చేస్తున్నారు. జిల్లాలో పేరుకుపోతున్న సమస్యలు.. తీసుకోవాల్సిన చర్యలపై కూలంకుషంగా చర్చిస్తే ప్రయోజనముంటుందని భావిస్తున్నారు.

### వీటిపై చర్చిస్తారా?

● జిల్లా అంతటా వైరల్ వ్యాధులు ప్రబలుతున్నా.. ప్రత్యేక వైద్యశిబిరాలు చేపట్టిన దాఖలాలు లేవు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలు సక్రమంగా అందడం లేదు. శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో వైద్యులంతా మొక్కుబడిగా విధులు నిర్వహిస్తూ.. ప్రైవేటు క్లినిక్‌లకు అతుక్కుపోతున్నారు. వీటిపై నిఘా పెట్టి పేదలకు ప్రభుత్వ వైద్యం సక్రమంగా అందించాలి.

● శ్రీకాకుళం రూరల్, గార మండలాల్లో ఇసుక అక్రమ రవాణా అడ్డుకునేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

● ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సరిపడా అవసరమైన విత్తనాలు.. ఎరువులు అందజేయాలి. నకిలీ పురుగుమందులు, ఎరువుల విక్రయాలను అరికట్టాలి. సాగునీటి కాలువల్లో (మిగతా 6వ పేజీలో..)

## నాలుగేళ్లుగా జడ్పీ నిర్వీర్యం

● విధులు లేవు.. నిధులు లేవు
● కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

రణస్థలం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలనలో జిల్లా పరిషత్‌ది ప్రత్యేక స్థానం. గతంలో జిల్లా అభివృద్ధిలో గణనీయమైన ముద్ర చూపే జిల్లా పరిషత్.. ప్రస్తుతం ఉత్సవ విగ్రహంలా మారిపోయింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిర్వీర్యమైంది. దానికి ప్రత్యేక నిధులు, విధులు లేకపోవడం కూడా ఇబ్బందికరంగా మారింది. 2021లో జిల్లా పరిషత్‌ను వైసీపీ కైవసం చేసుకుంది. అప్పట్లో ప్రతిపక్షాలకు జిల్లా పరిషత్‌లో కనీస ప్రాతినిధ్యం లేదు. దీంతో వైసీపీ ఇష్టారాజ్యం సాగింది. టీడీపీ తరపున హిరమండలం జడ్పీటీసీ పొగిరి బుచ్చిబాబు ఎన్నికైనా.. సమావేశాల్లో కనీసం ఆయనకు మాట్లాడే అవకాశం లేకుండా పోయింది. ఈ క్రమంలో గడిచిన నాలుగేళ్లలో జిల్లాపరిషత్ జిల్లా అభివృద్ధిలో ఎటువంటి ముద్ర చూపలేకపోయింది. జడ్పీ పాలకవర్గానికి కేవలం పది నెలల పదవీకాలం మాత్రమే ఉంది. ప్రక్షాళన దిశగా కూటమి ప్రభుత్వమే చర్యలు చేపట్టాల్సి ఉంది.

### ● ఇదీ పరిస్థితి..

ఉమ్మడి జిల్లాలో 38 మండలాల్లో 920 పంచాయతీలున్నాయి. 2021 మార్చిలో పంచాయతీ ఎన్నికలు జరిగాయి. తరువాత జడ్పీ ఛైర్మన్‌తో పాటు ఎంపీపీలు ఎన్నికయ్యారు. కానీ అటు జడ్పీ, ఇటు మండల పరిషత్‌ల్లో ఆశించినస్థాయిలో నిధులు లేవు. అంతకుముందు రెండేళ్లపాటు ప్రత్యేకాధికారుల పాలన సాగడంతో స్థానిక సంస్థలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయి. 14, 15 ఆర్థిక సంఘం నిధులు సైతం సరిగ్గా ఖర్చు కాలేదు. తరువాత ఎన్నికైన సర్పంచ్‌లకు తెలియకుండా వైసీపీ ప్రభుత్వం విద్యుత్ బిల్లుల పేరిట ఆర్థిక సంఘం నిధులను మళ్లించింది. దీంతో కొన్ని గ్రామాల్లో పారిశుధ్య కార్మికులకు కూడా వేతనాలు చెల్లించలేని స్థితిలో పంచాయతీలున్నాయి.

● నిధులు, విధుల్లో జడ్పీ స్వతంత్ర్యంగా వ్యవహరించేది. 32 శాఖలకు సంబంధించి పర్యవేక్షణ జడ్పీదే. విద్యాశాఖ పదోన్నతులు, బదిలీలు కూడా జడ్పీ పరిధిలోనే జరిగేవి. విచక్షణాధికారాలు (మిగతా 6వ పేజీలో..)

## సీడీసీ డీన్‌గా ఉదయభాస్కర్

ఎచ్చెర్ల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్శిటీ సీడీసీ డీన్‌గా డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయభాస్కర్.. వర్సిటీలోని బయోటెక్నాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. ఇప్పటివరకు సీడీసీ డీన్‌గా వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత అదనపు బాధ్యతలు నిర్వర్తించారు.

## బేస్‌బాల్ పోటీలకు ఎంపికలు రేపు

శ్రీకాకుళం స్పోర్ట్స్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం కోడి రామ్మూర్తి క్రీడా ప్రాంగణంలో ఈ నెల 29న ఉదయం 9 గంటలకు జిల్లాస్థాయి బేస్‌బాల్ ఎంపికలు నిర్వహించనున్నట్టు ఆ సంఘ అధ్యక్షుడు జి.వీరభద్రరావు, ప్రధాన కార్యదర్శి వి.రాంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీనియర్ విభాగంలో ఈ ఎంపికలు పురుషులు, మహిళలకు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆధార్‌కార్డు జెరాక్స్ జనన ధ్రువీకరణ పత్రం, నాలుగు ఫొటోలతో హాజరు కావాలని కోరారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు వచ్చేనెల 12, 13 14వ తేదీల్లో అనంతపురంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

**టీ తాగుతూ.. సామాన్యులతో ముచ్చటిస్తూ..**
● ఏడాది పాలనపై మంత్రి అచ్చెన్న ఆరా
6లో

**వైసీపీ నుంచి జనసేనలో చేరికలు**
● చీపురుపల్లి సర్పంచ్‌తో పాటు 200 కుటుంబాలు..
8లో



జైలును పరిశీలిస్తున్న జిల్లా న్యాయాధికారి జేఏ మౌలానా

## జిల్లా జైలు పరిశీలన

శ్రీకాకుళం లీగల్/ నరసన్నపేట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): అంపోలులో జిల్లా జైలును జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా శుక్రవారం పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలపై ఆరాతీశారు. జైలు పరిశుభ్రత, ఆహార పద్ధతులు, భద్రతపై అధికారులతో చర్చించారు. బెయిల్ పిటిషన్ వివరాలు తెలుసుకున్నారు. అనంతరం నరసన్నపేట సబ్‌జైలును పరిశీలించారు. సదుపాయాలపై ఆరా తీశారు. న్యాయ సలహాలు వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ దివా కర్‌నాయుడు, నరసన్నపేట కోర్టు న్యాయాధికారి ఎం.ఎస్.వాణి, అధికారులు పాల్గొన్నారు.

## బీటెక్, ఎంసీఏ రెండో సెమిస్టర్ షెడ్యూల్ విడుదల

ఎచ్చెర్ల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ యూనివర్సిటీలోని ఇంజనీరింగ్, ఎంసీఏ కోర్సుల రెండో సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్‌ను వర్సిటీ అధికారులు శుక్రవారం విడుదల చేశారు. జూలై 10నుంచి వర్సిటీలో పరీక్షలు జరగనున్నాయి. వచ్చే నెల 6లోగా విద్యార్థులు పరీక్ష ఫీజును చెల్లించాలని తెలిపారు.



## జై.. జగన్నాథ

బొందిలీపురంలోని రథయాత్రలో పాల్గొన్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జగన్నాథుడి రథయాత్రను పురస్కరించుకుని శుక్రవారం జిల్లావ్యాప్తంగా భక్తులు పూజలు చేశారు. రథయాత్రలో పాల్గొని జై జగన్నాథ.. నామస్మరణతో రథాన్ని ముందుకు లాగారు. శ్రీకాకుళంలోని బొందిలీపురం సదావర్తి పలహారి తఖియా ముల్కీదాస్ ఆధ్వర్యంలో బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామిని ఇలిసిపురంలోని గుండిచా మందిరానికి రథయాత్రపై ఊరేగింపుగా తీసుకెళ్లారు. శనివారం జగన్నాథస్వామిని మత్స్యావతారంలో అలంకరించనున్నామని అర్చకులు సుభద్ర పండా, బాలు పండా తెలిపారు. అలాగే గుజరాతిపేటలో లక్ష్మేశ్వర ఆలయం వద్ద రథయాత్రలో కూడా అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మొండేటివారి వీధి, పాండురంగవారి వీధిలో జగన్నాథ స్వామిని రథంలో ఊరేగించి గుడించా మందిరానికి చేర్చారు. తొమ్మిది రోజులపాటు జగన్నాథుడు పూజలు అందుకోనున్నారని అర్చకులు తెలిపారు.

# జై జగన్నాథ





పలాసలో భక్తుల కోలాహలం మధ్య జగన్నాథుని రథయాత్ర



ఉత్సవమూర్తులను రథంపైకి తీసుకువెళ్తున్న అర్చకులు

### ఇచ్ఛాపురంలో..

ఇచ్ఛాపురం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): స్థానిక జగన్నాథస్వామి ఆలయంలో రథయాత్ర ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రధాన అర్చకులు పద్మకుమార్, రామకృష్ణ ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి రథయాత్ర వైభవంగా సాగింది. ఎమ్మెల్యే బెందాళం అశోక్, టీడీపీ నాయకులు దర్శించుకున్నారు. ఆలయ మేనేజర్ బెండి రామారావు ఏర్పాట్లు చేశారు. రథంవీధి, గోర్జీవీధి జంక్షన్, మార్కెట్ రోడ్, దాసన్నపేట, మెయిన్ రోడ్డు మీదుగా గుడించా వరకు రథయాత్ర సాగింది.

### కవిటిలో..

కవిటి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కవిటిలోని బెహరావీధిలోని జగన్నాథస్వామికి శుక్రవారం ఘనంగా పూజలు చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులతో రథయాత్ర చేపట్టారు. చేపట్టారు. కవిటి పురవీధుల్లో స్వామివారిని ఊరేగించారు.



రథయాత్రలో పాల్గొన్న భక్తులు

### పొందూరులో..

పొందూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జగన్నాథస్వామి రథయాత్ర మండల కేంద్రం పొందూరులో శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. మహరాజా మార్కెట్‌లో ఉన స్వామి ఆలయం నుంచి పొందూరు పట్టణంలో రథయాత్ర సాగింది. కాగా దశాబ్దాలనాటి రథం శిథిలావస్థకు చేరుకోవడంతో పొందూరు పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు బలివాడ కిషోర్‌కుమార్ సాయంతో కొత్త రథాన్ని తయారు చేయించారు.



రథయాత్రకు సిద్ధం చేసిన ఉత్సవమూర్తి



పట్టణంలో స్వామివారి రథయాత్ర

### కళింగపట్నంలో..

గార, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కళింగపట్నంలోని కోదండరామస్వామి ఆలయంలో శుక్రవారం జగ్నథస్వామి రథయాత్ర వైభవంగా జరిగింది. తొలుత స్వామి వారి ఉత్సవమూర్తులను అలంకరించిన రథంపై మేళ, తాళాలతో ఊరేగింపు చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కళింగపట్నంలో స్వామి వారి రథయాత్ర

### బూర్జలో..

బూర్జ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం బూర్జలో జగన్నాథ రథయాత్ర శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ యాత్రలో ఎమ్మెల్యే కూన రవికుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ, డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యం, పీరుకట్ల సీతబాబు పాల్గొన్నారు.



రథయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే రవికుమార్

### వేడుకగా..

హిరమండలం, జూన్27 (ఆంధ్రజ్యోతి): హిరమండలంలో జగన్నాథ రథయాత్ర శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. స్థానిక ఆలయం నుంచి గుండిచా మందిరం వరకు రథంపై స్వామి ఊరేగింపు మేళతాళాలు, భక్తుల కోలాహలం మధ్య సాగింది. ఈ సందర్భంగా మహిళల కోలాట ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్ఐ ఎండీ యాసిన్ బందోబస్తు నిర్వహించారు.



జగన్నాథ రథయాత్ర ఊరేగింపులో మహిళల కోలాట ప్రదర్శన

### కదిలిన జగన్నాథ రథ చక్రాలు..

పలాస, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జై జగన్నాథ నినాదాలతో శుక్రవారం జగన్నాథ రథచక్రాలు కదిలాయి. పలాస రైల్వే స్టేషన్ సమీపంలోని సీతారామాలయం ప్రాంగణంలోని జగన్నాథ స్వామి ఆలయం నుంచి సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథ స్వామి దారు విగ్రహాలను ప్రత్యేక రథంలో వేంచేపు చేసి రైల్వే ఆసుపత్రి మైదానంలో ఉన్న గుండిచా మందిరం వరకు భారీ ఊరేగింపుతో తీసుకువెళ్లారు. ఆలయ ధర్మకర్త చందన్‌త్రిపాఠి ప్రత్యేక పూజలు చేసి యాత్రను ప్రారంభించగా రథాన్ని మందిర కార్యదర్శి గిన్ని జయశంకర్ రెడ్డి ప్రారంభించారు. వందలాది మంది భక్తులు రథంపై ఉన్న స్వామిని దర్శించుకుని పునీతులయ్యారు. కార్యక్రమంలో మునిసిల్ చైర్మన్ బళ్ల గిరి బాబు, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి లొడగల కామేశ్వర రావుయాదవ్, ఎం.నరేంద్ర, పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, కార్యదర్శి సప్ప నవీన్, గురిటి సూర్య నారాయణ, డొక్కర శంకర్, కౌన్సిలర్లు గుజ్జు జోగారావురెడ్డి, సవర సోమేశ్వరరావు, జిల్లా రైస్‌మిల్లర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శాసనపురి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కాశీబుగ్గ సీఐ పి.సూర్య నారాయణ ఆధ్వర్యంలో పోలీసుబందో బస్తు ఏర్పాటు చేశారు.



రథయాత్రలో పాల్గొన్న భక్తులు

### మఠం కంచిలిలో..

కంచిలి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మఠం కంచిలిలో జగన్నాథస్వామి రథయాత్ర ఆలయ ట్రస్టీ జానకిరాందాస్ మహంతి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారి రథాన్ని ముందుకు నడిపించారు. ప్రధాన ఆలయం నుంచి గుండిచా వరకు ఉత్సవమూర్తులతో రథయాత్ర సాగింది.



టీ తాగుతూ మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

## టీ తాగుతూ.. సామాన్యులతో ముచ్చటిస్తూ..

● ఏడాది పాలనపై మంత్రి అచ్చెన్న ఆరా..

ఆమదాలవలస, జూన్ 27(ఆంధ్రజ్యోతి): సామాన్యుడి మనోభావాలను తెలుసుకోవాలన్న ఆలోచనతో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఓ టీ దుకాణం వద్ద ఆగి.. టీ తాగుతూ.. అక్కడివారితో శుక్రవారం ముచ్చటించారు. వివరాల్లోకి వెళ్తే.. శుక్రవారం పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనకు వెళ్లి తిరిగి వస్తూ బూర్జ మండలం మదనాపురం కూడలిలోని టీ దుకాణం ఆగారు. అక్కడే ఓ సామాన్యుడిలా టీ తాగుతూ.. టీకొట్టు యజమానితోపాటు అక్కడివారితో మాటామంతీ కలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఏడాది పాలనపై ఆరా తీశారు. టీ దుకాణం యజమానితోపాటు అక్కడివారు కూటమి ప్రభుత్వ పాలనపై సంతృప్తి వ్యక్తం చేయడంతో మంత్రి సంతోషం వ్యక్తం చేశారు.

## పీఎం ఉషా నిధులు సద్వినియోగం చేయాలి

● కేంద్ర విద్యాశాఖ అదనపు కార్యదర్శి భర్నవాల్



వర్చువల్ సమావేశంలో పాల్గొన్న బీఆర్ఏయూ వీసీ కేఆర్ రజని తదితరులు

ఎచ్చెర్ల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యాభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు ప్రధానమంత్రి ఉచ్ఛతర శిక్ష అభియాన్ (పీఎం ఉషా) నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలని కేంద్ర విద్యాశాఖ అదనపు కార్యదర్శి ఎస్‌కే భర్నవాల్ సూచించారు. పీఎం ఉషా నిధులకు ఎంపికైన దేశంలోని వివిధ యూనివర్సిటీల వీసీలు, అధికారులతో శుక్రవారం వర్చువల్ విధానంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బోధన, పరిశోధన, నూతన నిర్మాణాలు, లేబొరేటరీలు, స్కిల్ డెవలప్‌మెంట్, క్రీడా మైదానాల అభివృద్ధికి ఈ నిధులు అధికంగా వెచ్చించాలన్నారు. నిర్దేశిత సమయంలో ఈ నిధులు సద్వినియోగపర్చకపోతే తదుపరి గ్రాంటు విడుదల కాదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ కేఆర్ రజని మాట్లాడుతూ.. రెండో విడతలో పీఎం ఉషా పథకానికి అర్హత సాధించిన దేశంలోని 12 యూనివర్సిటీల్లో అంబేడ్కర్ యూనివర్సిటీ ఒకటని చెప్పారు. వర్సిటీ పంపిన సమగ్ర నివేదికకు ఈ నెల 21వ తేదీన ఆమోదం లభించిందన్నారు. ఈ నిధుల వినియోగానికి ఇప్పటికే ప్రణాళికలు రూపొందించామన్నారు. పీఎం ఉషా రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ నారాయణ భరత్ అమరావతి నుంచి, బీఆర్ఏయూ నుంచి వీసీతో పాటు రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్, ఎస్‌వో డాక్టర్ సామ్రాజ్యలక్ష్మి, పీఎం ఉషా వర్సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ టి.సంతోష్ పావని పాల్గొన్నారు.

## పరిశ్రమలకు స'పోర్టు'

(ఐదో పేజీ తరువాయి)

మారిటైం బోర్డు ప్రతినిధులు, పరిశ్రమల శాఖ అధికారులు, ఏపీఐఐసీ ప్రతినిధులు పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూములను పరిశీలించారు ఈ ప్రాంతంలో పరిశ్రమలు నెలకొల్పితే ఏఏ రకాల వనరులు సమకూరుస్తామన్నది ఆయా సంస్థల ప్రతినిధులకు టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

**ఉపాధి అవకాశాలు మెరుగు..**

పోర్టుకు దగ్గరగా పరిశ్రమలు ఏర్పాటుకు అవసరమైన రోడ్డు, రైలు మార్గాలు, విద్యుత్, నీటి సదుపాయాలు, ఇబ్బందులు లేని ఫీజుబులిటీ భూములు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నాం. పరిశ్రమలు ఏర్పాటు ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. విశాలమైన తీర ప్రాంతం ఉంది. ఇప్పటికే హల్దియా పెట్రో కెమికల్స్, కళ్యాణి స్టీల్స్, యామ్నా సంస్థల ప్రతినిధులు ఈ ప్రాంతాన్ని సందర్శించడంతో వారికి అవగాహన కల్పించాం.

-కృష్ణమూర్తి, ఆర్డీవో, టెక్కలి

## దివ్యాంగులకు అండగా ఉంటాం

(ఐదో పేజీ తరువాయి)

పంపిణీ చేస్తున్నాం. జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి.. దివ్యాంగులకు ఏయే ఉపకరణాలు అవసరమో గుర్తించాం. అందుకు అనుగుణంగా 353 బ్యాటరీ సైకిళ్లతోపాటు వీల్ ఛైర్‌లు, వినికిడి పరికరాలు, కృత్రిమ అవయవాలు తదితరవి పంపిణీ చేయడం ఆనందంగా ఉంది. మీ కష్టం నాకు తెలుసు. మీ సంకల్ప బలానికి సెల్యూట్. మీకు ఏ సమస్య వచ్చినా.. వెంటనే స్పందిస్తా. మీరు ఎల్లప్పుడూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాల'ని పిలుపునిచ్చారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతీనెలా మూడో శుక్రవారం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న 'స్వాభిమాన్' కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు. దివ్యాంగుల పరికరాలను బాగు చేసేందుకు శ్రీకాకుళంలో త్వరలోనే ఒక సర్వీసింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. దివ్యాంగులు సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని.. జీవితంలో అభివృద్ధి చెం దాలని ఆకాంక్షించారు. సమస్యలపై ప్రతీనెలా మూడో శుక్రవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తే.. వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. దివ్యాంగుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, పౌర విమానయాన సంస్థ ఛైర్మన్ విపిన్‌కుమార్, హెచ్ సభ్యుడు శ్రీనివాస్, జనరల్ మేనేజర్ సంజయ్‌సింగ్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఇండియా టర్ఫ్ పింక్ సంస్థ ఫౌండర్ ఆనంద్ కుమార్, డీసీఎంఎస్ ఛైర్మన్ చౌదరి అవినాష్, డీసీసీబీ ఛైర్మన్ ఎస్.సూర్యం, వంశధార ఛైర్మన్ అరవల రవీంద్ర, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు, నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ పాల్గొన్నారు.

## పాలీఇథలీన్ పరిశ్రమకు ప్రతిపాదన

(ఐదో పేజీ తరువాయి)

సమకూరుస్తామని తెలిపారు. సముద్రానికి దగ్గరగా మూడు కిలోమీటర్ల పరిధిలో కావాల్సిన స్థలం, సమీర్‌పేట లాజిస్టిక్ దగ్గర ఉన్న స్థలాన్ని వినియోగించుకోవచ్చునని పవర్ పాయింట్ ప్రజేంటేషన్ ద్వారా ఆర్డీవో వివరించారు. పోర్టు నిర్మాణ సంస్థ విశ్వసముద్ర జనరల్ మేనేజర్ శంకరరావు కూడా.. పోర్టు నిర్మాణం, బెర్తులు సంఖ్య, మౌలిక సౌకర్యాలు కల్పన, నిర్మాణ పనులపై అమెరికన్ బృందానికి అవగాహన కల్పించారు. దీంతో ఈ ప్రాంతం పరిశ్రమ ఏర్పాటుకు అనుకూలంగా ఉందంటూ ఎగ్జాంబిల్ కంపెనీ ప్రతినిధులు జేవెస్టకాట్, సేలింలో తెలిపారు. ఇక్కడ పరిశ్రమ ఏర్పాటు చేస్తే ఏడాదికి రెండు మిలియన్ మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ తయారీ చేస్తామని, ఎంతో మందికి ఉపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హేమసుందర్, ఏపీఐఐసీ జెడ్ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించరూ!

(ఐదో పేజీ తరువాయి)

పూడికలు తొలగించాలి. దశాబ్దాలుగా ఉన్న వంశధార షట్టర్ల కేసుకు పరిష్కారం చూపేలా.. ప్రజాప్రతినిధులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి. గొట్టాబ్యారేజీకి నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలి. వంశధార ఫేజ్ 2, ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు పూర్తి చేసేలా నిధులు మంజూరుకు తీసుకుంటున్న చర్యలను వివరించాలి.

● పంచాయతీల్లో దోమల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి.

● జల్‌జీవన్ మిషన్ ఆధ్వర్యంలో జరిగే పనులు పూర్తిచేయాలి.

● శ్రీకాకుళం కోడి రామ్మూర్తి స్టేడియం, శ్రీకాకుళం కలెక్టరేట్ ఎప్పటికి పూర్తవుతాయో ఎవరికీ తెలియదు. ఇంకనూ అదనపు నిధులు మంజూరుచేయాల్సి ఉంది.

● గ్రామీణస్థాయిలో బెల్టుషాపుల విచ్చలవిడిగా ఉన్నాయి. మద్యం దుకాణాలు కొన్ని గంటల ముందుగానే తెరుచుకుంటున్నాయి. వీటిపైనా దృష్టిసారించి చర్యలు తీసుకోవాలి.

● కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో మెనూ సక్రమంగా అమలయ్యేలా చర్యలు చేపట్టాలి.

● శ్రీకాకుళం నియోజకవర్గంలో పర్యాటకంగా ఉన్న రెండు సముద్రతీరాలు కనుమరుగయ్యాయి. వంశధార, నాగావళి నదీ ప్రవాహల దిశలు మారడంతో సముద్రం వద్దకు వెళ్లేందుకు వీల్లేకుండా పోయింది.

● అరసవల్లి ఆదిత్యుని మాస్టర్ ప్లాన్‌ను అభివృద్ధి ప్రకటనలకే పరిమితమైంది.

● ఎచ్చెర్ల మండలంలో శిల్పారామం ప్రాజెక్టు అతీగతిలేదు. జిల్లా పర్యాటక అధికారి పనితీరును కూడా బేరేజు వేసి.. పర్యాటక ప్రగతిపై చర్చించాలి. ఎచ్చెర్ల నియోజకవర్గంలో అత్యధిక పరిశ్రమలున్నా స్థానిక యువతకు ఉపాధి లభించడంలేదు. దీనిపై సమగ్రంగా దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలి.

● మండలస్థాయిలో కొంతమంది అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండట్లేదు. సమీక్షలని.. క్షేత్రస్థాయిల పర్యటన అంటూ నిరంతరం ఏవో కారణాలు చెబుతున్నారు. తహసీల్దార్, ఎమ్పీడీవో, ఎంఈవో.. ఇలా అధికారులంతా ప్రజలకు అందుబాటులో ఉండేలా ఆదేశాలు జారీఅవ్వాలి.

● గత ప్రభుత్వం ఇచ్చిన సెంటు స్థలాల్లో అప్పట్లోనే అక్రమాలు జరిగాయి. ఇందులో కొంతమంది సచివాలయ సిబ్బంది కూడా ఉన్నారు. అధిక మంది అనర్హులు కూడా పట్టాలు పొందారు. శ్రీకాకుళం నగరంతోపాటుగా పలుచోట్ల అక్రమాలు చోటుచేసుకున్నాయి. వీటిపై దర్యాప్తు చేయాలి. ఇలా జిల్లాలో పలు సమస్యలకు పరిష్కారం చూపేలా సమావేశం సాగాలని జిల్లావాసులు కోరుతున్నారు.

## నాలుగేళ్లుగా జడ్పీ నిర్వీర్యం

(ఐదో పేజీ తరువాయి)

సైతం ఉండేవి. కానీ రానురాను ప్రభుత్వాలు ఆ అధికారాలకు కత్తెర వేశాయి. గతంలో ఇసుక, గనుల సీనరేజ్ అంతా జడ్పీ పరిధిలోనే ఉండేవి. ఇసుక రీచ్‌ల నిర్వహణ కూడా ఉండేది. కానీ ఇసుక ప్రభుత్వానికి ఆదాయ వనరుగా మారడంతో హస్తగతం చేసుకుంది. గతంలో సీనరేజ్ రూపంలో వచ్చే ఆదాయాన్ని పంచాయతీల కు 50శాతం, జిల్లా పరిషత్, మండల పరి షత్‌లు చెరో 50 శాతం పంచుకునేవి. అయితే సీనరేజ్ చార్జీలు గత కొన్నేళ్లుగా చెల్లించడం లేదు. నేరుగా ప్రభుత్వ ఖాతాకే జమవుతున్నాయి. కానీ ప్రభుత్వం నుంచి తిరిగి రావడం లేదు.

**● చెల్లింపుల్లో జాప్యం..**

రిజిస్ట్రేషన్ సర్‌చార్జీలు, నీటి తీరువా పన్నుల్లో కొంత మొత్తం స్థానిక సంస్థలకు ఆదాయం వచ్చేది. ఎకరాకు నీటి తీరువా రూ.200 వసూలు చేస్తే అందులో 5 నుంచి 10 శాతం పంచాయతీలకు జమయ్యేది. పంచాయతీ పరిధిలో ఎవరైనా భూములు విక్రయించి రిజిస్ట్రేషన్ చేసుకుంటే రిజిస్ట్రేషన్ శాఖ నుంచి సర్‌చార్జీల రూపంలో కొంత మొత్తం పంచాయతీలకు వచ్చేది. కానీ కొన్నేళ్లుగా ఈ చెల్లింపులు నిలిచిపోయాయి. ఆదాయం లేక ఎమ్మెల్యేలు, ఎంపీల నిధులపై ఆధారపడుతున్నారు. కొన్ని మండలాల్లో అయితే ఎంపీపీలు, జడ్పీటీసీలు కూర్చునేందుకు కనీసం చాంబర్లు లేవు. పాత భవనాల్లో అధికారులు, సిబ్బంది విధుల నిర్వహణకే కష్టంగా ఉంది.

**● చీకటి రోజులు..**

వైసీపీ హయాంలో జిల్లాపరిషత్ నిర్వీర్యమైంది. టీడీపీ తరపున ఎన్నికైన ఏకైక జడ్పీటీసీని నేనే. అప్పట్లో ఏదైనా సమస్యపై మాట్లాడితే వైసీపీ ప్రజాప్రతినిధులు అడ్డుకునేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత జిల్లా పరిషత్‌తో పాటు పల్లె పాలనకు వెలుగు వచ్చింది. ఏదైనా గత నాలుగేళ్లు జడ్పీకి చీకటి రోజులు.

-పొగిరి బుచ్చిబాబు, జడ్పీటీసీ, హిరమండలం

**● గౌరవ భృతి లేదు..**

2021 సెంప్టంబరులో జడ్పీటీసీల పాలన కొలువుతీరింది. ఆరు నెలలపాటు నెలకు రూ.6 వేలు చొప్పున గౌరవభృతి అందింది. గత మూడేళ్లగా గౌరవభృతి అందలేదు. గత ప్రభుత్వ హయంలో జడ్పీకి నిధులు అంతంతమాత్రమే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే పరిస్థితి కొనసాగుతోంది. ఇప్పటికైనా ప్రత్యేకనిధులు మంజూరు చేయాలి.

-టొంపల సీతారాముడు, జడ్పీటీసీ, రణస్థలం

## ప్రతీ ఒక్కరిపై మొక్కలు పెంచే బాధ్యత

● కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు

నరసన్నపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మొక్కలను నాటి వాటిని సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్‌అండ్ బీ అతిథిగృహం ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో గ్రీనరీ కోసం మొక్కలు నాటి వాటి సంరక్షణను అధికారులకు అప్పగించాలన్నారు. ప్రజా ప్రతినిధులు తరచూ వచ్చే ఆర్ అండ్‌బీ అతిథి గృహాలు, వివిధ కార్యాలయాల వద్ద ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డులను పెట్టాలన్నారు. సోలార్ ఎనర్జీ ప్యానల్స్‌ను ఏర్పాటు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు కేంద్రమంత్రి సూచించారు. గృహిణులు ఇంటి పెరటిలో పెంచేందుకు వీలుగా ఐదు రకాల మొక్కలను పంపిణీ చేశారు. అంతకు ముందు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, డీఎఫ్‌వో వేంకటేశ్వరరావు, శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష, ఆర్‌అండ్ బీ ఎస్‌ఈ పి.సత్యనారాయణ, నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, పలుశాఖ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



మొక్క నాటి నీరు పోస్తున్న కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

# జిల్లాలో విస్తృతంగా రెడ్‌క్రాస్ సేవలు

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ ద్వారా జిల్లాలో విస్తృత సేవలు అందిస్తున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శుక్రవారం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన రెడ్‌క్రాస్ సర్వసభ్య సమావేశంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రకృతి విపత్తుల సమయంలో బాధితులకు తమవంతు అండగా నిలుస్తుందన్నారు. ఏడాది పొడవునా రక్తదాన శిబిరాలు నిర్వహించి వేలాది మంది ప్రాణాలను కాపడుతుందన్నారు. జిల్లాలో 28 మందికి తలసేమియా బాధితులకు రక్తం అందిస్తుండడం అభినందనీయమన్నారు. జిల్లా రెడ్‌క్రాస్‌కు రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు ఉందన్నారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ జగన్మోహనరావు మాట్లాడుతూ.. జిల్లా రెడ్‌క్రాస్ అందించిన సేవలకు రాష్ట్రస్థాయి అవార్డు దక్కిందని, ఈ అవార్డును వచ్చే నెల 9న విజయవాడలో గవర్నర్ నుంచి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అందుకుంటారన్నారు. గతేడాది రెడ్‌క్రాస్ ద్వారా అందించిన సేవలను ఈ సందర్భంగా వివరించారు. రక్తదాన శిబిరాలు నిర్వహించడగానికి సహాయ, సహకారాలు అందించిన వివిధ స్వచ్ఛంద సంస్థలు, కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులను సత్కరించారు. తొలుత రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీ డునాంట్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏడాదిలో చేపట్టిన కార్యక్రమాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఉపాధ్యక్షుడు కె.సుధీర్, ట్రెజరర్ కె.దుర్గారావు, ఏజీఎం పరిశీలకులు ఎం.శ్రీరాములు, ప్రతినిధులు పెంకి చైతన్యకుమార్, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

● రణస్థలం: గతేడాది అక్టోబరు 2న గాంధీ జయంతిని పురష్కరించుకుని మహాలక్ష్మి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో రికార్డు స్థాయిలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించడం తో ఆ క్లబ్ అధ్యక్షుడు నడుకుదిటి తేజాబాబును కలెక్టర్ అభినందించారు. ఉత్తమ సేవలు అందించిన తేజాబా బుకు అవార్డుతోపాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

● ఆమదాలవలస: పట్టణంలోని పూజారిపేటలో ఉన్న కృతిక్ ఫౌండేషన్స్ సంస్థ అందిస్తున్న సేవలకు రెడ్‌క్రాస్ అవార్డు దక్కింది. ఈ మేరకు సంస్థ వ్యవస్థాపకుడు చిగురుపల్లి వెంకటేష్ ప్రశంసాపత్రం, అవార్డు రెడ్‌క్రాస్ ప్రతినిధుల నుంచి అందుకున్నారు.



కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ నుంచి అవార్డు, ప్రసంసా పత్రాన్ని అందుకుంటున్న మహాలక్ష్మి యూత్ క్లబ్ అధ్యక్షుడు నడుకుదిటి తేజాబాబు

## కాలువ నిర్మాణానికి తొలగిన అడ్డంకి



పైపులైన్ మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

కవిటి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కవిటి ప్రభుత్వ ఆసుపత్రివీధిలో కాలువ నిర్మాణానికి ఉన్న అడ్డంకులను శుక్రవారం తొలగించారు. ఈస్థలంలో ఉద్దానం నీటి పైపులైన్ లీకై తాగునీరు వృధాగా పోతుండడంపై ఆ ప్రాజెక్టు సిబ్బంది శుక్రవారం మరమ్మతులు చేపట్టి వృథా నీటిని అరికట్టారు. ఇదే విషయాన్ని గురువారం ఆంధ్రజ్యోతిలో 'తవ్వేశారు.. వదిలేశారు' శీర్షికతో ప్రచురితమైన కథనంపై వారు స్పందించారు. ఆసుపత్రి ఎదురువీధిలో కాలువ తవ్వకం చేపట్టినా మధ్యలో విద్యుత్ స్తంభం ఉండడంతో నిర్మాణానికి అడ్డుగా ఏర్పడింది. గురువారం విద్యుత్ అధికారులు స్పందించి పాత స్తంభాన్ని తప్పించి పక్కకు మార్పుచేశారు. దీంతో కొద్దిరోజులుగా ఇబ్బంది పడుతున్న ఆ వీధిప్రజలకు కాలువ కష్టాలు తీరనున్నాయి.

## పాలిటెక్నిక్ కౌన్సెలింగ్‌కు 260 మంది హాజరు

ఎచ్చెర్ల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరేందుకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (శ్రీకాకుళం)లో పాలిసెట్ -2025 వెబ్ కౌన్సెలింగ్ కొనసాగుతుంది. శుక్రవారం 1,04,001 నుంచి 1,20,000 వరకు నిర్వహించిన కౌన్సెలింగ్ 260 మంది హాజరయ్యారు. ఇందులో ఓసీ, బీసీ విద్యార్థులు 214 మంది, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 46 మంది ఉన్నారు. శనివారం 1,20,001 నుంచి చివరి ర్యాంకు వచ్చిన విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తారు.

## ఆదిత్యుని దర్శించుకున్న ప్రముఖులు

అరసవల్లి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్ విపిన్ కుమార్, మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ అధికారి శ్రీనివాస్ శుక్రవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అనివెట్టి మండపంలో అర్చకులు వారికి వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి జ్ఞాపికలను, ప్రసాదాలను ఆలయ ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ వారికి అందజేశారు. కార్యక్రమంలో ఇప్పిలి రంజిత్‌శర్మ, దర్భముళ్ల శ్రీనివాసశర్మ, రామకృష్ణ, బీఎస్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. అలాగే శ్రీకూర్మంలో కూర్మనాథుని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

## రిటర్న్స్ ఫైలింగ్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఆదాయపు పన్నుల అధికారి

పొందూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు సమర్పించాల్సిన ఆదాయపు పన్ను రిటర్న్స్ ఫైలింగ్, ట్రెజరీకి సమర్పించాల్సిన జీతాలు, ఇతర బిల్లులపై ఆదాయపు పన్ను, ట్రెజరీ అధికారులు పొందూరు, జి.సిగడాం మండలాల డీడీవోలతో సమీక్ష, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విశాఖకు చెందిన ఆదాయపు పన్నుశాఖ అధికారులు ఫైలింగ్‌పై సూచనలు, సలహాలు అందించారు. టాక్స్ ఫైలింగ్‌లో ప్రభుత్వం ఇచ్చిన మినహాయింపులపైనా అవగాహన కల్పించారు. 24 జీవో ప్రకారం ప్రతినెలా 15 తేదీలోగా ఆదాయపు పన్ను పరిధిలోకి వచ్చే అధికారుల రిటర్న్స్ ఫైలింగ్ చేయడంలో డిఫాల్టర్లు అయిన డీడీవోలకు 16వ తేదీ నుంచి రోజుకు రూ.200 నుంచి రూ.500 వరకు పెనాల్టీ విధించడం జరుగుతుందన్నారు. సీఎంఎఫ్ఎస్ పోర్టల్, నిధి పోర్టల్ లేటెస్ట్ ప్రొవిజన్ మ్యాపింగ్, బిల్స్ సబ్మిట్ చేయడంలో పొరపాట్లపై ట్రెజరీ అధికారులు అవగాహన కల్పించారు. జీవో 1512 ప్రకారం సమర్పించాల్సిన బిల్లులను సూచించిన తేదీలోగా సమర్పించాలని అధికారులు సూచించారు. ఈ సమీక్షలో ఆదాయపు పన్నుశాఖ అధికారులు ఐటీవో చంద్రశేఖరన్ ప్రధాన్, టీఏ ఎర్నిబాబు సోంపేటి, ఎంటీఎస్ సుప్రజిత్ బెనర్జీ, ఎస్‌టీవో ఎం.తులసీరావు, డీఎల్‌వో పి.శ్రీనివాసరావు, ఎస్ఏ రమణమ్మ, జేఏ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యాన్లు వితరణ

కవిటి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కవిటిలోని అగ్నికుల క్షత్రియ సంఘ భవనానికి అవసరమైన ఫ్యాన్లను కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎల్.రాజేష్ అందించారు. శుక్రవారం కవిటిలోని సంఘ భవనంలో జరిగిన కార్యక్రమంలో సంఘ సభ్యులంతా కలసి రాజేష్‌ను సత్కరించారు. రూ.పది వేలు విలువ కలిగిన ఫ్యాన్లను సంఘ సభ్యులకు అందించారు.

## స్వామి వివేకానంద విగ్రహావిష్కరణ


విగ్రహావిష్కరణలో పాల్గొన్న గ్రామస్థులు

సోంపేట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): స్వామీ వివేఆకనంద విగ్రహావిష్కరణ ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో విగ్రహదాత తోణంగి జోగారావు, ప్రధానోపాధ్యాయుడు బెందాళం మల్లేశ్వరరావు, రామకృష్ణ సేవసమితి ప్రతినిధులు స్వసంవేద్యానందజీ, కార్యదర్శి గరుడాచలం శంకరరావు, సంపతిరావు విశ్వనాథం, కె.పోతయ్య, రెల్ల నారాయణ ఉన్నారు.

## మినీ రిజర్వాయర్ పనులు పక్కాగా చేయాలి

సరుబుజ్జిలి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కొత్తకోట మినీ రిజర్వాయర్ మరమ్మతు పనులు పక్కాగా చేయాలని వంశధార ఈఈ సీతారామనాయుడు సూచించారు. కొత్తకోట రిజర్వాయర్‌లో జరుగుతున్న పనులు, అలాగే కుడికాలువలో జరుగుతున్న పూడికతీతను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కంట్రాక్టర్లకు పనులు నిర్వహణపై పలు సూచనలు చేశారు. పరిశీలనలో డీఈ శ్రీనివాసరావు, జేఈలు జగదీష్, ఖాజా, వెంకటరమణ, స్థానిక సర్పంచ్ సురవరపు జగదీశ్వరరావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ పేడాడ వెంకటరమణ పాల్గొన్నారు.

## టీడీపీ సంస్థాగత ఎన్నికలు


నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న దృశ్యం

బూర్జ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాలు మేరకు ఆమదాలవలస ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం బూర్జ మండల టీడీపీ సంస్థాగత ఎన్నికలు నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడిగా వావిలపల్లి సీతారాంబాబు, ఉపాధ్యాక్షుడిగా పిల్లా కన్నంనాయుడు, ప్రధాన కార్యదర్శిగా హనుమంతు గోపిమాస్టార్, కార్యనిర్వహణ కార్యదర్శులుగా గేదెల నవీన్, కొయ్యాన సూర్యనారా యణ, బెవర రామారావు, కార్యదర్శులుగా జద్దు కృష్ణమూరి, అనం తగిరి నున్నగొప్పల వాసుదేవరావు, కోశాధికారిగా బుడుమూరు సత్యనారాయణ నియమితులయ్యారు.

## మహిళలకు స్వయం ఉపాధి కల్పనే లక్ష్యం

● మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు


శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్న

సరుబుజ్జిలి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు వివిధ సంక్షే పథకాలను ప్రవేశపెట్టారని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనకు వెళుతున్న మంత్రికి సరుబుజ్జిలి మండల కేంద్రంలో డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సరుబుజ్జిలి గ్రామ సచివాలయంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన సందర్శించి మహిళలతో మాట్లాడారు. ఉదయం 9 గంటల నుంచి శిక్షణ ప్రారంభించడం వల్ల ఇబ్బంది పడుతున్నామని, సమయపాలనలో మార్పులు చేయించాలని మంత్రిని మహిళలు కోరారు. దీంతో జిల్లా మేనేజర్‌తో మంత్రి ఫోన్‌లో మాట్లాడగా.. కమిషనర్ ఆదేశాలు మేరకు నిర్వహిస్తున్నామని ఆమె చెప్పారు. కమిషనర్‌తో మాట్లాడుతానని, జిల్లాలోని అన్ని శిక్షణ కేంద్రాల్లో సమయాలు మార్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టీడీపీ నాయకులు దవళ సింహాచలం, బస్వా ఉమామహేశ్వరరావు, గుర్రాల చినబాబు, సురేష్, మధు, రాజారావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే శంకర్


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే పాల్గొని మా ట్లాడారు. ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలియజేస్తే అధికా రుల సమక్షంలోనే తక్షణ పరిష్కారం కృషి చేస్తానన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలతో నేరుగా మమేకమవుతూ వారి సమస్యలు తెలుసుకుంటుందన్నారు. తహసీల్దార్ కార్యాలయ, మునిసిపల్ సిబ్బంది, గార అధికారులు పాల్గొన్నారు.

## మా పాఠశాలను తరలించొద్దు

● ఎమ్మెల్యే రవికుమార్‌ను వేడుకున్న గాజులకొల్లివలస గ్రామస్థులు


వినతులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మా గ్రామంలోని పాఠశాలను తరలించవద్దని గాజులకొల్లివలస గ్రామస్థులు ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను వేడుకున్నారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా గాజులకొల్లివలస గ్రామపెద్ద మెండేటి కర్మారావు ఆధ్వర్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందించారు. వందేళ్ల చరిత్ర కలిగిన ఈ పాఠశాలలో ఎంతో మంది చుదువుకుని ఉన్నత స్థాయికి చేరుకున్నారన్నారు. 30 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలను కేవలం ఆరుగురు విద్యార్థులు ఉన్న ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పాఠశాలలో విలీనం చేమొద్దన్నారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినని చంద్రశేఖర్, ఎంపీటీసీ అన్నెపు భాస్కరరావు, కూన ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని పదో వార్డు హడ్కో కాలనీకి చెందని నాగళ్ల మురళీధర్ బీసీ సంక్షేమ సంఘం యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులు కావడంతో అతడిని ఎమ్మెల్యే రవికుమార్ సత్కరించారు. పలువురు కూటమి నేతలు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారం

● ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు

ఎచ్చెర్ల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రాధాన్యతాక్రమంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికా బద్ధంగా పనిచేస్తున్నామన్నారు. అలాగే మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, ఎంపీడీవో ఎస్.హరిహరరావు, తహసీల్దార్ బి.గోపాలరావు, కూటమి నేతలు బెండ మల్లేశ్వరరావు, సంపతిరావు నాగేశ్వరరావు, మెండ రాజారావు, బల్లాడ అరుణ, మూకళ్ల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్యం మెరుగునకు సహకరించాలి

● డీపీవో భారతి సౌజన్య


అధికారులకు సూచనలిస్తున్న డీపీవో భారతి సౌజన్య

గార, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం మెరుగునకు ప్రతి ఒక్కరూ సహకరించాలని డీపీవో భారతి సౌజన్య కోరారు. బూరవెల్లి, తూలుగు, శ్రీకూర్మం గ్రామాల్లో శుక్రవారం పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడుతూ గ్రామాల్లో వీధి కాలువలు, మంచినీటి కొళాయిలు, బావుల వద్ద చెత్తాచెదారం వేయొద్దన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ప్రాజెక్ట్ మేనేజర్ నిశ్చల, ఈవోపీఆర్డీ కూర్మారావు, సర్పంచ్‌లు గోరు అనిత, సంధ్యారాణి, కాసులమ్మ, పంచాయతీ కార్యదర్శులు నవీన్, ఈశ్వరమ్మ, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారికి సారె సమర్పణ


అమ్మవారికి సమర్పించిన వంటకాలు


దర్శించుకుంటున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం ప్రారంభం సందర్భంగా సంతోషిమాత అమ్మవారికి ప్రీతికరమైన రోజు శుక్రవారం పట్టు వస్త్రాలు, చీర, గాజులు, పసుపు, కుంకుమ, పుష్పాలతోపాటు 58 రకాల స్వీట్స్, పిండివంటలతో కూడిన సారె సమర్పించారు. అమ్మవారికి సుప్రభాత సేవ, క్షీరాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో మునగవలస సుకన్య, సిబ్బంది నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సాగు విధానాలు మార్చుకోవాలి

లావేరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటసాగు విధానంలో మార్పులు చేసుకోవాలని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సీనియర్ ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు అన్నారు. శుక్రవారం వాళ్లపేట గ్రామంలో ఫెర్టికమ్ సీడ్ డ్రిల్ ద్వారా వి.జగదీశ్వరరావు పంట పొలంలో సాగుచేస్తున్న క్షేత్రాలను సందర్శించిన అవగాహన కల్పించారు. లావేరు మండల సమన్వయకర్తలు జగ్గురోతు గోపాల్, వైశ్యరాజుల వెంకన్న తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## 'గేట్' ర్యాంకర్‌కి అభినందన


తండ్రితోపాటు విద్యార్థినిని సత్కరిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ పరిధిలోని శ్రీకాకుళం క్యాంపస్ సీఎస్ఈ విద్యార్థిని కొమరాల శ్వేత ఇటీవల ప్రకటించిన గేట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరించింది. పల్నాడు జిల్లా దుగ్గి గ్రామానికి చెందిన శ్వేత గేట్‌లో 241 ర్యాంకు సాధించింది. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన ఈ విద్యార్థిని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ ఆకాక్షించారు. శుక్రవారం క్యాంపస్‌కు వచ్చిన శ్వేత, ఆమె తండ్రి ఆదినారాయణను ట్రిపుల్ ఐటీ అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏవో డాక్టర్ ముని రామకృష్ణ, డీన్ శివరామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు, వెల్ఫేర్ డీన్ రవి, మోహన కృష్ణ చౌదరి పాల్గొన్నారు.

## 4 నుంచి సీసీ కెమెరాల ఇన్‌స్టాలేషన్‌పై ఉచిత శిక్షణ

ఎచ్చెర్ల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలోని మండల కాంప్లెక్స్ రోడ్‌లోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో జిల్లాకు చెందిన యువతకు సీసీ కెమెరా ఇన్‌స్టాలేషన్‌పై జూలై 4వ తేదీ నుంచి ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు సంస్థ డైరెక్టర్ ఎస్.రాంజీ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 13 రోజల పాలు నిర్వహించే ఈ శిక్షణలో ఉచితంగా భోజన, వసతి సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. 19-45 ఏళ్ల లోపు వయసు గల వారు అర్హులన్నారు. ఆసక్తి గలవారు 7993340407, 9553410809 ఫోన్ నెంబరులో సంప్రదించాలని కోరారు.

## బావిలో పడిన కుక్క

● బయటకు తీసిన అగ్నిమాపక సిబ్బంది

ఇచ్ఛాపురం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): నీళ్లులేని పెద్ద బావిలో ఓ కుక్క పడిపోయింది. దీనిని బయటకు తీసేందుకు విపత్తుల నివారణ, అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని జగన్నాథస్వామి ఆలయం వెనుక ఉన్న పెద్దబావిలో గురువారం రాత్రి ప్రమాదవశాత్తు ఓ కుక్క పడిపోయింది. ఈ విషయం స్థానికుల ద్వారా తెలుసుకున్న అగ్నిమాపక శాఖ అధికారి కె.ప్రశాంత్‌కుమార్ సిబ్బందితో శుక్రవారం ఘటనా స్థలానికి చేరుకున్నారు. పెద్ద బకెట్లో బిస్కెట్లు, ఆహార పదార్థాలు వేసి తాళ్లతో కట్టి బావిలోకి దింపారు. అయినా ఆ కుక్క బకెట్లోకి వెళ్లకుండా బయటకు వచ్చేందుకు గోడపైకి ఎగురుతూ అరుస్తోంది. దీంతో చేసేదేమీలేక పెద్ద నిచ్చెన తెచ్చి లోపల నిలిపారు. ఆ కుక్కకు నిత్యమూ ఆహారం అందించే వెంకటేష్ సాహు ఆ నిచ్చెన గుండా బావిలోకి దిగి.. ఆ కుక్కను బకెట్‌లో పెట్టాడు. జాగ్రత్తగా అగ్నిమాపక సిబ్బంది బయటకు లాగారు. బయటకు వచ్చిన ఆ శునకం అందరి చుట్టూ తిరుగుతూ సందడి చేసింది. వినియోగంలో లేని ఈ బావిని ఇంకుడు గుంతగా వినియోగిస్తున్నారు. దానికి ఉన్న రంధ్రాలను మూసివేయాలని స్థానికులు కోరుతున్నారు. శునకాన్ని రక్షించిన అగ్నిమాపక సిబ్బందికి స్థానికులు అభినందనలు తెలిపారు.

# తొలి రథయాత్ర ప్రారంభం

జగన్నాథ రథయాత్ర శుక్రవారం భక్తుల కోలాహలం మధ్య ప్రారంభమైంది. జిల్లాలో వివిధ గ్రామాల్లోని జగన్నాథ స్వామి ఆలయాల నుంచి బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథుని దారు విగ్రహాలను రథంపై ఉంచి ఊరేగించారు. ఈ సందర్భంగా జై జగన్నాథ్ అంటూ భక్తుల నినాదాలతో గ్రామాలు, పట్టణాలు మారుమోగాయి. అనంతరం గుడించా మందిరాలకు విగ్రహాలను తీసుకువచ్చి అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. తొలి రథయాత్ర సందర్భంగా వేలాది మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. శనివారం నుంచి తొమ్మిది రోజుల పాటు స్వామి వివిధ అవతారాల్లో దర్శనమివ్వనున్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం


టెక్కలిలో జగన్నాథ రథయాత్ర


పలాస రూరల్: తర్లాకోట గ్రామంలో..


నరసన్నపేటలో..


హరిపురం/మందస: సాబకోటలో


జలుమూరు: రథయాత్రలో చిన్నారుల కోలాట ప్రదర్శన


పాతపట్నం: జగన్నాథ రథయాత్ర

## ఆగస్టులో పెళ్లి.. ఇంతలోనే మృతి


హరికృష్ణ (ఫైల్)

టెక్కలి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): అక్కవరం గ్రామానికి చెందిన బందాపు హరికృష్ణ(25) రైలు నుంచి జారిపడి మృత్యువాత పడిన ఘటనతో గ్రామంలో విషాదం నెలకొంది. బందాపు దానమ్మ, లక్ష్మణరావుల ఏకైక కుమారుడు హరికృష్ణ విశాఖలో ప్రైవేటుగా ఉద్యోగం చేస్తున్నాడు. ఆగస్టులో వివాహం నిశ్చయమైంది. అయితే శుక్రవారం వేకువజామున విశాఖ నుంచి ఇంటికి వస్తూ నౌపడాలో రైలు దిగే సమయంలో జారిపడి రైలు కింద పడి మృతిచెందాడు. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామ స్థులు విలపిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. వివాహం కావాల్సిన కుమారుడు ఇలా మృత్యువాత పడడంతో ఆ తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. నౌపడా జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుదాఘాతానికి గురై యువకుడి మృతి


రమేష్ (ఫైల్)

నరసన్నపేట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మడపాం టోల్‌ప్లాజా వద్ద టీ దుకాణం మేడమీదకు వెళ్లి విద్యుత్ తీగెలు తగిలి నరసన్నపేట మండలం పాలకొండపేటకు పి.రమేష్ (28) గురువారం రాత్రి మృతి చెందినట్లు ఎస్‌ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. మృతుడు తన స్నేహితులతో కలిసి గురువారం రాత్రి 10 గంటలు సమయంలో స్వగ్రామం నుంచి మడపాం టోల్‌ప్లాజా వద్దకు టీ తాగేందుకు వచ్చి టీ తాగి మేడమీదకు వెళ్లి అక్కడ సిగరెట్ తాగి తరువాత స్నేహితులతో లేచిన సమయంలో 11 కేవీ విద్యుత్ వైర్లు చేయికి తగలడంతో అక్కడికక్కడే మృతిచెందగా స్నేహితుడు గణేష్‌కు చేయి, కాలుకు గాయాలయ్యాయి. మృతుడి తండ్రి అప్పన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు పోలీసులు తెలిపారు. అయితే రమేష్ మృతిపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయని స్థానికులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు.

## లారీ ఢీకొని తీవ్ర గాయాలు

కంచిలి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): అంపురం జంక్షన్ వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్తలి గ్రామానికి చెందిన మూలి సింహాచలం(27) తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కంచిలిలో జగన్నాథస్వామి రథయాత్రకు సైకిల్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా.. అంపురం జంక్షన్ వద్ద పలాస నుంచి ఇచ్ఛాపురం వైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఈ ఘటనలో సింహాచలం తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో ఉన్నాడు. స్థానికుల సహాయంతో 108 వాహనంలో సోంపేట సామాజిక ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం బరంపురం ఎంకేసీజీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ అప్పలరెడ్డి తెలిపారు. కాగా మందస మండలానికి చెందిన సింహాచలం.. కర్తలి గ్రామానికి చెందిన కూరమ్మను ఐదేళ్ల కిందట వివాహం చేసుకుని, అదే గ్రామంలో కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు.

## రణస్థలం మాజీ జడ్పీటీసీ లక్ష్మణరావుకు..

ఎచ్చెర్ల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్‌కు సమీపంలోని పాత జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన ప్రమాదంలో రణస్థలం మాజీ జడ్పీటీసీ గొర్లె లక్ష్మణరావు తీవ్రంగా గాయపడ్డారు. ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వర రావు నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌లో పాల్గొనేందుకు రణస్థలం నుంచి బస్సుపై వచ్చిన లక్ష్మణరావు.. మండల కాంప్లెక్స్ పాయింట్ వద్ద దిగారు. ఇదే సమయంలో చిలకపాలెం నుంచి వస్తున్న ఆటో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. అతడిని చికిత్స నిమిత్తం శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు ఆసుపత్రికి వెళ్లి లక్ష్మణరావు ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కూటమి నాయకులు చౌదరి నారాయణమూర్తి, పైడి వేణుగోపాలం, బెండు మల్లేశ్వరరావు పరామర్శించారు.

## పశుసంవర్ధక శాఖ డీడీగా నర్సింహులు


డీడీ నర్సింహులును అభినందిస్తున్న సిబ్బంది

టెక్కలి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): టెక్కలి డివిజన్ పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ)గా డాక్టర్ సీహెచ్.నర్సింహులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పాడేరు నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన డాక్టర్ జయరాజ్ పాడేరు బదిలీ అయ్యారు. డాక్టర్ నర్సింహులుకు సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. కార్యక్రమంలో పశు వైద్యులు శిరీష, పాపారావు, సూపరింటెండెంట్ బీర్జాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఏడీఏగా వెంకట మధు


బాధ్యతలు స్వీకరిస్తున్న మధు

నరసన్నపేట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ ఏడీగా వెంకట మధు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం పనిచేస్తున్న రవీంద్రభారతి శ్రీకాకుళం జేడీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. వెంకట మధు పలాస నుంచి ఇక్కడికి వచ్చారు.

## మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్

పలాస, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించే ఆలోచనను ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక సంఘ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే 107, 108 జీవోలను రద్దు చేస్తామని యువగళం పాద యాత్రలో ఇప్పటి మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చినా అమలుచేయ లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 17 మెడికల్ కళాశాలల పనులు నిలిపివేశారని, వాటిని ప్రైవేటీకరించేందుకు చర్యలు తీసుకోవడాన్ని తప్పుబట్టారు. సమావేశంలో విద్యార్థి సంఘ నాయకులు ప్రవీణ్, పవన్, సోమేష్, కుమార్ పాల్గొన్నారు.

## గ్రామీణ రోడ్ల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

● కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

జలుమూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ రోడ్ల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. లింగాలవలస నుంచి ఉసిరికిజోల వరకు నిర్మించిన బీటీ రోడ్డు, శ్రీముఖలింగం రోడ్డు నుంచి పంగవానిపేటకు నిర్మించిన సీసీ రోడ్డు, యలమంచిలి, అక్కురాడ వద్ద నిర్మించిన సీసీ రోడ్లను శుక్రవారం ప్రారంభించారు. స్థానికంగా ఓ కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ.. వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామీణ రోడ్లకు కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కేంద్రం సహకారంతో కోట్లాది రూపాయల ఉపాధి హామీ నిధులతో రోడ్ల పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, శ్రీకాకుళం ఆర్డీవో కె.సాయి ప్రత్యూష, ఎంపీపీ వాన గోపి, టీడీపీ నియోజకవర్గ సమన్వయ కర్త బగ్గు అర్చన, ఎంపీడీవో కె.అప్పలనాయుడు, తహసీల్దార్ జె.రామారావు, పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, చిత్రంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

## సమస్యలపై పారిశుధ్య కార్మికుల నిరసన

● అడ్డుకున్న పోలీసులు

కాశీబుగ్గ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద మునిసిపల్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన నిరసనను శుక్రవారం పోలీసులు అడ్డుకున్నారు. ర్యాలీ చేసేందుకు ఎటువంటి అనుమతులు లేవని పోలీసులు చెప్పడంతో పోలీసులు, కార్మికుల మధ్య వాగ్వాగం జరిగింది. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తాము సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే పోలీసుల జోక్యం ఏమిటని కార్మికులు ప్రశ్నించారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా పోలీసులు, మునిసిపల్ అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి గణపతి, యూనియన్ నాయకులు మురుగన్, వెంకట్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కడా లేని విధంగా పోలీసు నిబంధనలు ఇక్కడ అమలు చేయడం ప్రజల హక్కులను కాలరాయడమేనన్నారు. బకాయిలు, పీఎఫ్ డబ్బులు చెల్లించాలని, చనిపోయిన వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని, పనిముట్లు ఇవ్వాలని, కరోనా సమయంలో పనిచేసిన కార్మికులకు 14 నెలల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కారమయ్యే వరకూ ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికుల నిరసనను అడ్డుకుంటున్న పోలీసులు

## వైసీపీ నుంచి జనసేనలో చేరికలు

● చీపురుపల్లి సర్పంచ్‌తో పాటు 200 కుటుంబాలు..

మెళియాపుట్టి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ నుంచి చీపురుపల్లి పంచాయతీకి చెందిన సుమారు 200 కుటుంబాలు శుక్రవారం జనసేన పార్టీలో చేరాయి. సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. చీపురుపల్లి సర్పంచ్ ఈశ్వరరావు, మాజీ ఎంపీటీసీ సింహాద్రి, అనుచరులు, గ్రామస్థులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. వైసీపీలో ఉంటే ఆ నాయకులకు మనుగడ కష్టమేనన్నారు. ఇదే ఉద్దేశంతో చీపురుపల్లి గ్రామస్థులు జనసేనలో చేరడం ఆనందంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో కూడా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, వైసీపీకి భవిష్యత్ లేదన్నారు. ఆఫ్‌షోర్ సమస్యలను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గిరిజన గ్రామాల్లో డోలీ మోతలు కనిపించ కూడదనే ఉద్దేశంతో ప్రత్యేకశద్ధ తీసుకోవడం జరుగుతోందన్నారు. జనసేనలో చేరిన వారిలో కార్యక్ర మంలో జనసేన జిల్లా అధ్యక్షుడు పి.చంద్రమోహన్, పాతపట్నం సమన్వకర్త గేదెల చైతన్య, నేతలు కె.పూర్ణచంద్రరావు, దుక్క బాలరాజు, చంటి, ఎల్.కిరణ్‌కుమార్, మోహనరావు, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.


జనసేన పార్టీలో చేరిన చీపురుపల్లి సర్పంచ్ ఈశ్వరరావు తదితరులు

## ఘనంగా బంకించంద్ర చటర్జీ జయంతి

పాతపట్నం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వందేమాతర గీత రచయిత బంకించంద్ర చటర్జీ జయం తిని శుక్రవారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా హెచ్‌ఎం ఎస్.వైకుంఠరావు మాట్లాడుతూ.. వందేమాతర గీతం స్వాతంత్ర్యోద్యమంలో ఎంతో మందికి స్ఫూర్తిని రగిలించిందన్నారు. నేటికీ పాఠశాలల్లో ప్రార్థనా గీతంగా నిలిచి విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందిస్తోందన్నారు. విద్యార్థులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను ప్రజలకు తెలపాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏడాది సుపరిపాలన, చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. తన స్వగృహంలో క్లస్టర్ యూనిట్, బూత్, పార్టీ మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటింటికి వెళ్లి ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై ప్రజల్లో చైతన్యంచేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయ కులు పాల్గొన్నారు. ● పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న నట్టల నివారణ కార్యక్రమాన్ని శుక్రవారం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రారంభించారు. అలాగే 75శాతం రాయితీపై పశుగ్రాసం వితనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ మంచు కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు కేంద్ర, రాష్ట్ర మంత్రుల పర్యటన

పాతపట్నం/కొత్తూరు/ఎల్ఎన్‌పేట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పాతపట్నం నియోజకవర్గంలో శనివారం కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు పర్యటించనున్నారని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. పాతపట్నం మండలం కొరసవాడలో ఉద్దానం-2 ప్రాజెక్ట్ పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు, కొత్తూరు, హిరమండలం, ఎల్ఎన్‌పేట మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నాని పేర్కొన్నారు. ఎల్ఎన్‌పేటలో ప్రజాదర్బార్ నిర్వహిస్తారని, ప్రజలు వారి సమస్యలను వినతుల రూపంలో అందించాలన్నారు. కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాలు విజయవంతంచేయాలని కోరారు.

## ఖరీఫ్‌నకు పుష్కలంగా సాగునీరు: ఈఈ


గొట్టాబ్యారేజీ ఎడమ కాలువ గేటు నిర్వహణను పరిశీలిస్తున్న ఈఈ సీతారాంనాయుడు

హిరమండలం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్‌కు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగునీరందిం చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని గొట్టాబ్యారేజీ ఈఈ సీతారాం నాయుడు అన్నారు. శుక్రవారం బ్యారేజిని సందర్శించి నీటి నిల్వ పరిస్థితిని పరిశీలించారు. కుడి,ఎడమ కాలువల నిర్వహణపై డీఈ సరస్వతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూలై రెండోవారంలో కుడి, ఎడమ ప్రధాన కాలువలకు సాగునీటిని విడిచిపెట్టే అవకాశం ఉందన్నారు. బ్యారేజీ అన్ని గేట్లు మూసివేసి నిటిని నిల్వచేసినట్లు చెప్పారు. ప్రస్తుతం నీటి మట్టం 37 మీటర్లకు చేరుకుందన్నారు. కార్యక్రమలో ఏఈ ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన గ్రామాల అభివృద్ధికి చర్యలు

టెక్కలి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపుతున్నాయని ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్ అన్నారు. శుక్రవారం మేఘవరం పంచాయతీ జీడిపేటలో 'ధర్తీఅబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్'లో గ్రామసభ నిర్వహించారు. గిరిజనుల కోసం అమలుచేస్తున్న పలు పథకాలను వివరించారు. సమావేశంలో ఐటీడీఏ అధికారితో పాటు బీజేపీ నాయకులు రామ్‌జీ, జన్ని పరమేశ్వరరావు, నడుపూరు లక్ష్మీనారాయణ, మాజీసర్పంచ్ అల్లు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

## పథకాలపై అవగాహన కలిగి ఉండాలి

పలాసరూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలపై గిరిజనులు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో ఎన్.వసంత్ కుమార్ అన్నారు. లొత్తూరు గిరిజన గ్రామంలో శుక్రవారం 'ధర్తీఅబా జన భాగిదారి అభియాన్' కార్యక్రమంపై అవగాహన కలిగించారు. గిరిజనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీడీవో మెట్ట వైకుంఠరావు, ఏపీవో శంకరరెడ్డి, సునీల్‌కుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఐవీఆర్ఎస్ ద్వారా ఇంటింటి సర్వే

కోటబొమ్మాళి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పంచాయతీలో పారిశుధ్య పనులపై ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి వివరాలు సేకరిస్తున్నామని, దీనికోసం ఇంటింటి సర్వే చేపడుతున్నామని డిప్యూటీ ఎంపీడీవో జె.ఆనందరావు తెలిపారు. శుక్రవారం రేగులపాడు, సౌడాం పంచాయతీలలో జరుగుతున్న సర్వేని పరిశీలించారు. ఈ సర్వేలో అలసత్వం ప్రదర్శించవద్దని, కార్యదర్శులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## కనీస వేతనాలు అమలు చేయాలి

పలాసరూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి డిమాండ్ చేశారు. జూలై 9న చేపడుతున్న సార్వత్రిక సమ్మెకు మద్దతుగా సమ్మె చేసేందుకు మధ్యాహ్న భోజన కార్మికులు ఎంఈవో-2 చెరుకుపల్లి సత్యానికి శుక్రవారం నోటీసు అందించారు. లేబర్‌కోడ్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన సంఘ నాయకులు పి.భూదేవిపాత్రో, వై.మణమ్మ, బి.శశిరేఖ, శకుంతల, అప్పాయమ్మ పాల్గొన్నారు.

### న్యూస్ బాక్స్

## రేపు సత్సంగం

కోటబొమ్మాళి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఊడికలపాడు గ్రామ శ్రీరామ మందిరంలో ఆదివారం సత్సంగం నిర్వహిస్తున్నట్లు శ్రీరామకృష్ణ రమణ కరుణ గీతాశ్రమం సభ్యుడు సనపల కరుణ్ కుమార్ తెలిపారు. కాకినాడ గీతాశ్రమానికి చెందిన దివ్యానంద సరస్వతి స్వామి భక్తుల నుద్దేశించి ప్రసంగిస్తారన్నారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

## నేడు మునిసిపల్ సమావేశం

పలాస, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ పాలకవర్గ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ బళ్ల గిరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులతో పాటు అధికారులు సమావేశానికి సకాలంలో హాజరుకావాలని కోరారు.

## పర్యావరణ పరిరక్షణకు కృషి



నందిగాం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని మండల ప్రత్యే కాధికారి, డీఎల్‌పీవో ఐవీ రమణ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటే కార్య క్రమం చేపట్టారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కుమార్ పట్నాయక్, ఉప ఎంపీడీవో టి.రాజారావు, వ్యవసాయాధికారి పి.శ్రీకాంత్ వర్మ పాల్గొన్నారు.

## రాష్ట్ర సంక్షేమానికి కేంద్రం అనేక పథకాలు

కాశీబుగ్గ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సంక్షేమానికి కేంద్రంలోని ప్రధాని మోదీ అనేక పథకాలను అమలు చేస్తున్నారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వైకుంఠరావు అన్నారు. శుక్రవారం పట్టణంలో 11 ఏళ్ల ప్రధానమంత్రి మోదీ సుపరి పాలనపై స్ట్రీట్ కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ 18 గంటలు పనిచేస్తూ దేశ ప్రజల కోసం ఎనలేని సేవలు అందుబాటులోకి తెచ్చారన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

## నట్టల నివారణ మందు వేయించాలి

టెక్కలి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకలకు సీజనల్‌గా వచ్చే వ్యాధుల నివారణలో భాగంగా ఉచిత నట్టల నివారణ మందును వేయిం చాలని ఏపీ బీసీ యాదవ సంక్షేమ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ ఇప్పిలి జగదీశ్వరరావు అన్నారు. శుక్రవారం చిన్ననారాయణపురంలో పశువైద్యులు మెట్ట పూర్ణచంద్రరావు, నూతనప్రసాద్‌లతో కలిసి నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. తగిన మోతాదులో నట్టల నివారణ మందును మూగజీవాలకు వేయించాలని ఆయన కోరారు.

## వీఆర్ఏల కార్యవర్గం ఎన్నిక

వజ్రపుకొత్తూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): వీఆర్ఏల సంఘం మండల కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి.డిల్లీశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా టి.లక్ష్మీనారాయణ, కార్యదర్శిగా పి.కామరాజు, కోశాధికారిగా కె.రాజేష్, జాయింట్ కార్యదర్శిగా బి.విమలను ఎన్నుకున్నారు.

## ఎంపీహెచ్ఈవోగా నర్సింగరావు

ఎల్.ఎన్.పేట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): తురకపేట పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈవోగా బమ్మిడి నర్సింగరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి పీహెచ్‌సీ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.